RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక


వరంగల్ | మంగళవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 102 | మార్చి 11, 2025 | వెల : రూ.3-00

www.vedhanews.in

**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యల పరిష్కారమే మా ఎజెండా..ఇంత కాలం మేము ప్రచురించిన కథనాలే అందుకు ఉదాహరణ.. నిజమైన, నిఖార్సైన జర్నలిజానికి వేదికగా నిలుస్తున్న 'వేద న్యూస్' తెలుగు దినపత్రికలో నిజాలు రాసి నిఖార్సైన జర్నలిస్టుగా రాణించాలనుకునే వారికి ఇదే మా ఆహ్వానం..

9701923260, 9701920379



## స్టేషన్‌పై కడియం మార్క్!

- రూ.800 కోట్ల పనులకు శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్
- మంత్రివర్గ విస్తరణలో తెరపైకి శ్రీహరి పేరు
- కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ కేంద్రబిందువుగా శ్రీహరి!
- సీనియర్ పొలిటీషియన్‌కు మరోసారి మంత్రి పదవి?
- ఇప్పటికే స్టేషన్‌ఘన్‌పూర్ సెగ్మెంట్ నుంచి ఐదుగురు మంత్రులు, ఇద్దరు డిప్యూటీ సీఎంలు

**వేద న్యూస్, ఫోకస్ టీమ్:**

తెలంగాణలోనే కాక ఉమ్మడి ఏపీ రాజకీయాల్లోనూ సీనియర్ పొలిటీషియన్‌గా, రాజకీయ ఓనమాలు తెలిసిన వారికి దాదాపుగా సుపరిచితమైన పేరు కడియం శ్రీహరి అని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అతి సాధారణ కుటుంబం నుంచి వచ్చి డిప్యూటీ సీఎం స్థాయి వరకు రాజకీయాల్లో రాణించి.. విషయ పరిజ్ఞానం, సరుకు ఉన్న తలపండిన రాజకీయ నాయకుడిగా పేరుగాంచారు. ఎన్టీఆర్, చంద్రబాబుతో పాటు కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేసిన సుదీర్ఘ అనుభవం శ్రీహరికి ఉంది. విద్యాశాఖ మంత్రిగా తనదైన మార్క్‌ను వేశారు. 'చదువుకుందాం రా..' వంటి కార్యక్రమాలు చేపట్టి అక్షరాస్యతను పెంచే ప్రయత్నాలు చేశారు. ఎంపీ(లోక్‌సభ సభ్యుడి)గా కేజీబీవీల్లో గర్ల్ చైల్డ్ ఎడ్యుకేషన్‌పై కమిటీకి నాయకత్వం వహించి ఆడపిల్లలకు కేజీబీవీల్లో 8 నుంచి 12 వరకు చదువు అందించాలనే కీలక సూచనను చేశారు. కేంద్రం దానిని పాటించి దేశవ్యాప్తంగా సుమారు 5 వేలకు పైగా కేజీబీవీల్లో పిల్లలకు చదవు అందించడంలో కడియం పాత్ర కీలకమైనది. ఈ సంగతులు అలా పక్కనబెడితే.. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో బీఆర్ఎస్‌ను వీడి గతేడాది కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి.. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ కేంద్రబిందువుగా, కీలకంగా వ్యవహరించబోతున్నారనే టాక్ రాజకీయ వర్గాల్లో వినబడుతోంది. తన అసెంబ్లీ సెగ్మెంట్ స్టేషన్ ఘన్‌పూర్‌లో సీఎం రేవంత్ చేతుల మీదుగా

మిగతా 4వ పేజీలో..

## ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- ఈ నెలాఖరు వరకే 25 శాతం రాయితీతో గడువు

**వేద న్యూస్, వరంగల్ జిల్లా :**

ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ సదుపాయాన్ని లేఅవుట్, నాన్ లేఅవుట్ పాట్ల యజమానులు, డెవలపర్లు, ప్లాట్ల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్యశారాద, పి. ప్రావీణ్య అన్నారు. సోమవారం హనుమకొండలోని కుడా కార్యాలయంలో వారు జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖడే, సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఎల్ఆర్ఎస్ పై లేఅవుట్ డెవలపర్లు, సర్వేయర్లు, యజమానులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్లు మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ కు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు రెగ్యులరైజ్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు అనుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. 26 ఆగస్టు 2020 కు ముందు రిజిస్ట్రేషన్ అయిన తర్వాత కచ్చా లేఔట్ చేసిన వారు, వాటిలో ప్లాట్‌లు తీసుకున్న ఎల్ఆర్ఎస్ కు వచ్చిన దరఖాస్తుదారులు క్రమబద్ధీకరించు కొనేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. రెగ్యులరైజ్ చేసుకోవడానికి 25 శాతం రాయితితో ఈ నెలాఖరు (మార్చి 31) వరకే ప్రభుత్వం గడువు కల్పించిందని అన్నారు. గడువు



పొడగింపు ఉండదని, కల్పిస్తున్న రాయితీ ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. లే అవుట్ లు చేసిన వారు, ఓనర్లు, రైటర్ లు, బిలరు ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి సమాచారం, అవగాహన కల్పించి సకాలంలో ఎల్ఆర్ఎస్ చేయించుకునే విధంగా బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అవగాహన లేకపోవడం లేదా సమాచారం లేకపోవడం వల్ల సద్వినియోగం చేసుకోకుంటే రేపటినాడు ఎప్పుడైనా ఎల్ఆర్ఎస్ ఆమోదం లేని ప్లాటుపై ఇల్లు కట్టుకోవాలంటే అప్పటి ప్లాట్ వాల్యూ పై ప్రో రేటా ఫీజుతో పాటు 14 శాతం పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని తెలియజేశారు. నిషేధిత స్థలం లేదా చెరువు, కుంట కింద లేకుంటే ప్లాట్ల యజమాని ఫోన్ కు నేరుగా ఎంత డబ్బులు కట్టాలో సమాచారం వెళుతుందన్నారు. ఏదేని కారణం చేత ఎల్ఆర్ఎస్ తిరస్కరణకు గురి అయితే చెల్లించిన డబ్బుల నుంచి 10 శాతం ప్రాసెసింగ్ ఫీజు కింద మినహాయించుకొని మిగిలిన 90 శాతం డబ్బులు తిరిగి ప్లాటు యజమాని ఖాతాలో జమ చేయడం జరుగుతుందని వివరించారు. ఎల్ఆర్ఎస్ ఉంటే ప్లాటుకు రక్షణ ఉంటుందని, ఎవరు అక్రమించుకోడానికి అవకాశం ఉండదని అదేవిధంగా లే అవుట్ ప్లాట్ల ప్రాంతాన్ని మున్సిపాలిటీ ద్వారా అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందన్నారు. భవిష్యత్తులో ప్లాటు అమ్ముకోవాలనుకున్న ఎల్ఆర్ఎస్ ఉన్న ప్లాటుకు మంచి డిమాండ్ ఉంటుందని అన్నారు

అధికారులు,మున్సిపల్ కమిషనర్లు, బిల్డర్లు, లే అవుట్ ప్లానర్ ప్లాటు యజమానులతో సంప్రదించి ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేవిధంగా చూడాలని కోరారు. జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ పాత ప్లాట్ల కు సంబంధించి ఎల్ ఆర్ ఎస్ కట్టాలనుకుంటే రిజిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ ద్వారా ప్రక్రియ పూర్తయిన తర్వాత సంబంధిత సమాచారం కార్పొరేషన్‌కు చేరుతుందని అన్నారు. ప్రభుత్వం కల్పించిన ఇట్టి సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఎల్ఆర్ఎస్ కు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే బల్దియా అధికారుల దృష్టికి తీసుకువస్తే సహకరిస్తారని

మిగతా 4వ పేజీలో..



## సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన సీపీ


**వేద న్యూస్, వరంగల్ క్రైమ్ :**

ఈ నెల 16 న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో పర్యటన నేపథ్యంలో సోమవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా డీసీపీ రాజ మహేంద్ర నాయక్, ఘన్ పూర్ డివిజనల్ పోలీస్ అధికారులతో కలిసి పాలకుర్తి రోడ్డులోని శివుని పల్లిలో స్థలాన్ని సందర్శించి పబ్లిక్ మీటింగ్ సంబంధించి పోలీస్ పార్కింగ్ స్థలాలు, హెలిప్యాడ్, పరిశీలించడంతో పాటు సీఎంకు కల్పించాల్సిన భద్రత ఏర్పాట్లు, పోలీస్ బందోబస్త్ పై పోలీస్ కమిషనర్ క్షేత్రస్థాయిలో సమీక్షా జరిపారు.

## సుభాష్ శర్మకు మరణ శిక్ష..!

- ప్రణయ్ హత్య కేసులో కోర్టు సంచలన తీర్పు
- మిగిలిన నిందితులకు జీవిత ఖైదు
- ఈ తీర్పుతో పరువు హత్యలు ఆగిపోవాలి
- ప్రణయ్ తండ్రి పెరుమాల బాలస్వామి

**వేద న్యూస్, నల్గొండ :**



ప్రణయ్ హత్య కేసులో నల్గొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఏ2 అయిన సుభాష్ శర్మకు న్యాయస్థానం మరణ శిక్ష విధించింది. మిగిలిన నిందితులకు జీవిత ఖైదు ఖరారు చేసింది. మారుతీరావు కుమార్తె అమృతను ప్రణయ్ అనే యువకుడు 2018 జనవరిలో హైదరాబాద్‌లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరి వివాహంతో రెండు కుటుంబాల మధ్య విబేధాలు వచ్చాయి. దీంతో ఇరు కుటుంబాలు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ క్రమంలోనే తాను

మిగతా 4వ పేజీలో..

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**వేద న్యూస్, శాయంపేట :**



భూపాలపల్లి నియోజకవర్గం హనుమకొండ జిల్లా శాయంపేట మండలం గట్లకానిపర్తి గ్రామంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే ఎస్సీ కాలనీలో రూ. 10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్లు లేని అర్హులందరికీ ఇందిరమ్మ పథకంలో ఇళ్లు మంజూరు చేసి చేస్తామని ,ఇళ్లు మంజూరు అయిన లబ్ధిదారులకు దశల వారీగా బిల్లులను అందించడం జరుగుతుంది అన్నారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారు అయిన దొడ్డి జమున - శంకర్ లకు ఎమ్మెల్యే శాలువా కప్పి అభినందించగా, ఎమ్మెల్యే జీఎస్సార్ కు ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారుడు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఫణి చంద్ర,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుదిపాల బుచ్చి రెడ్డి, నాయకులు పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, వైనాల కుమార స్వామి, నిమ్మల రమేష్ ,చిందం రవి, కట్టయ్య, విష్ణు, గ్రామస్తులు ఉన్నారు.

## అభివృద్ధికి ఆమడ దూరంలో రామలక్ష్మణపల్లి!

- దారంతా గతుకులు.. తాగునీటికి తిప్పలు
- కరెంటు ఇక్కట్లు.. ఆర్టీసీ బస్సు సౌకర్యం అంతంత మాత్రమే
- సమస్యల వలయంలో కామారెడ్డి జిల్లాకు సమీపంలోని పల్లె
- అధికారులు పట్టించుకోవాలని గ్రామస్తుల వేడుకోలు



వేద న్యూస్, ఫోకస్ టీమ్: 4లో..

# నెల్లిమర్లలో సీన్ రివర్స్

విజయనగరం : ఉమ్మడి విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గంలో 2024 ఎన్నికల్లో జనసేన జెండా ఎగిరింది. టీడీపీకి కంచుకోట లాంటి నెల్లిమర్ల సెగ్మెంట్‌ని పొత్తుల లెక్కల్లో భాగంగా చివరి నిముషంలో జనసేనకు కేటాయించారు. నియోజకవర్గం ఆవిర్భావం నుండి ఇక్కడ టీడీపి హవానే కొనసాగుతూ వచ్చింది. అలాంటి నియోజకవర్గాన్ని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ మాట కొట్టిపారేయలేక తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు వదులుకున్నారు. ఎవరు పోటీ చేసిన అంతిమంగా గెలవాలన్నదే తమ ధ్యేయమని పదే పదే చెప్పుకొచ్చారు కూటమి నేతలు. దానికి తగ్గట్లే నెల్లిమర్లలో కూటమి అభ్యర్థి అయిన లోకం మాధవి టీడీపీ సపోర్ట్‌తో సునాయాసంగా గెలిచారు .ముఖ్యంగా నియోజకవర్గ టీడీపీ కేడర్ జనసేనకు పూర్తి స్థాయిలో సహకారం అందించారు. ఎన్నికల ముందు తానే అభ్యర్థినన్న ధీమాతో నెల్లిమర్లలో.. పూర్తిస్థాయి గ్రౌండ్ వర్క్ చేసుకున్న టీడీపీ ఇన్చార్జ్ బంగార్రాజు పార్టీ అధిష్టానం నిర్ణయానికి శిరసావహించి ఎన్నకల ప్రచారంలో ఫుల్ ఎఫర్ట్స్ పెట్టారు. దాంతో లోకం మాధవి విజయం నల్లేరు మీద నడకలా సాగింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఇంకా ఏడాది కూడా గడవలేదు . కేవలం 8 నెలలు మాత్రమే పూర్తయ్యాయి . కానీ నెల్లిమర్ల కూటమిలో మాత్రం విభేదాలు రోజురోజుకీ తారాస్థాయికి చేరుకుంటున్నాయి .ఇప్పటికే పలుమార్లు ఎమ్మెల్యే లోకం మాధవి, టీడీపీ ఇన్చార్జ్ బంగార్రాజులు నువ్వెంత అంటే నువ్వెంత అంటూ బహిరంగంగానే వాగ్యుద్ధాలకు దిగారు. నెల్లిమర్ల నగర పంచాయితీ సమావేశంలో ఎమ్మెల్యే మాధవి ఆయన్ని గెట్ అవుట్ అంటూ అవమనపరిచారు. ఈ ఘటనను నియోజకవర్గ తెలుగు తమ్ముళ్ళు కూడా సీరియస్‌గా తీసుకున్నారు. బంగార్రాజుకి మద్దతు తెలుపుతూ సర్వసభ్య సమావేశం నిర్వహించి మాధవికి బహిరంగంగానే వార్నింగ్ ఇచ్చారు . టీడీపీ చలవతోనే గెలిచావన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని మండిపడ్డారు. ఆ తరువాత జనసేన, టీడీపీ పార్టీల క్రమ శిక్షణా సంఘం కమిటీలు మాధవికి, బంగార్రాజుకి ఈ విషయంలో క్లాస్ కూడా తీసుకున్నాయి . చిన్న చిన్న విభేదాలు ఉంటే సర్దుకుపోవాలి తప్ప రచ్చకెక్కడం సరికాదంటూ ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేశాయి .కానీ ఇటీవల జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ఇరు పార్టీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గు మంటున్నట్లు కనిపిస్తుంది. గ్రామ స్థాయిలో సైతం పరిస్థితి అలానే ఉందంట. ఎక్కడా సైకిల్, గాజుగ్లాసు పార్టీలు కలిసి పనిచేసే పరిస్థితి లేదంట. ఇటీవల బూరాడపేట గ్రామంలో జరిగిన ఘర్షణ అందుకు తార్కాణంగా నిలుస్తోంది. ఓ ఫీల్డ్ అసిస్టెంట్ పోస్ట్ విషయమై రెండు పార్టీల మధ్య పెద్ద యుద్ధమే నడిచింది. ఆ పోస్టు టీడీపీ కాకుండా జనసేనకి ఎలా కేటాయిస్తారంటూ తెలుగు తమ్ముళ్ళు ఫైర్ అయ్యారు. రెండు వర్గాల వారు ఒకరిపై ఒక్కరూ పిడిగుద్దులు కురిపించుకోవడంతో పలువురికి గాయలయ్యాయి . దాంతో గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాల్సి వచ్చింది.ఇదే కాదు నియోజకవర్గంలో నిత్యం పలు ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా ఎమ్మెల్యే లోకం మాధవి భర్త లోకం ప్రసాద్ ఇన్‌వాల్వ్‌మెంట్ పెరగడంతోనే విభేదాలు వస్తున్నాయని.. రెండు పార్టీలకు చెందిన కొందరు నాయకులు ఓపెన్‌గానే చెప్తున్నారు. పోలింగ్ వరకు టీడీపీ ఇంచార్ బంగార్రాజుతో కలిసికట్టుగా పని చేసిన లోకం మాధవి.. గెలిచిన తరువాత బంగార్రాజుతో పాటు టీడీపీ శ్రేణులను కూడా పట్టించుకోవడం మానేశారని.. అందుకు ఆమె భర్త పెత్తనమే కారణమన్న విమర్శలున్నాయి. స్థానికంగా బలోపేతమవ్వడానికి లోకం మాధవి భర్త వైసీపీ వారిని చేరదీస్తూ.. జనసేనలో చేర్చుకుంటున్నారని టీడీపీ నాయకులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ఆ క్రమంలో నెల్లిమర్ల నియోజకవర్గంలో టీడీపీని పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగా స్థానిక ఎమ్మెల్యే వర్గం పావులు కదుపుతున్నారని తెలుగు తమ్ముళ్లు వాపోతున్నారు.ఇప్పుడు తెలుగు తమ్ముళ్లతో కలిసి జనసైనికులు కూడా అదే వాయిస్ వినిపిస్తుండటం హాట్ టాపిక్‌గా మారింది. మొదట్లో జనసైనికులకు పెద్ద పీట వేసిన లోకం మాధవి ఇపుడు మెల్లగా వారిని కూడా పక్కకి నెట్టేస్తున్నారట. నెల్లిమర్లకు స్థానికేతురాలైన లోకం మాధవిని పాలన వ్యవహారాల్లో ఆమె భర్త లోకం ప్రసాద్ డామినేట్ చేస్తూ .. అధికార కార్యక్రమాలు, ప్రభుత్వ పనుల్లో చేతివాటం చూపిస్తున్నారని జనసైనికులు ఆరోపిస్తున్నారు. తాము పవన్ కళ్యాణ్ ఆశయాల కోసం అహర్నిశలు పని చేస్తుంటే.. ఎమ్మెల్యే, ఆమె భర్త సొంత ప్రయోజనాల కోసం కార్పొరేట్ రాజకీయం చేస్తున్నారని జనసైనికులు మండిపడుతున్నారు.ఆ క్రమంలో నాన్ లోకల్ వాళ్ళని గెలిపించడం పెద్ద తప్పైందని నెల్లిమర్ల కూటమి శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. టీడీపీ వారిని ఇప్పటికే దూరం పెట్టేసిన ఎమ్మెల్యేను జనసేన కార్యకర్తలు, ప్రజలు కలిసి సమస్యలు చెప్పుకుందామంటే కుదరడం లేదంట. ఇంటి దగ్గరకు వెళ్తే మాధవి భర్త పర్సనల్ వ్యక్తులు గేటు దగ్గరే అడ్డుకుంటూ.. ఎపుడు అడిగినా మేడమ్ బిజీ అంటూ తరిమేస్తున్నారంట.అదలా ఉంటే కూటమి కుమ్ములాటలతో వైసీపీ శ్రేణులు నవ్వుకుంటున్నాయంట. తమను ఓడించి ఇప్పుడు వాళ్ళలోవాళ్ళే కొట్టుకుంటుంటే వైసీపీ కేడర్ తెగ ఎంజాయ్ చేస్తోందంట. ఏదేమైనా ప్రత్యర్థులను టార్గెట్ చేయాల్సిన కూటమి నాయకులు కొట్లాటలతో వారికి వారే టార్గెట్ అవుతుండటం నెల్లిమర్లలో హాట్‌టాపిక్‌గా మారిందిప్పుడు. చూడాలి మరి భవిష్యత్‌లోనైనా సర్దుకుపోతారో.. లేక వీళ్ళే సర్దేసుకొని, ప్రత్యర్థులకు పట్టం కడతారో.

# కమలం గూటికి విజయసాయిరెడ్డి

విశాఖపట్టణం : మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వైసీపీతో పాటు తన ఎంపీ పదవికి కూడా హఠాత్తుగా రాజీనామా చేశారు. ఇక తాను రాజకీయాలకు దూరమని హార్టికల్చర్ చేసుకుంటానని ప్రకటించారు. అన్నట్లుగానే ఆయన రాజీనామా చేసి కొన్నాళ్లు కనిపించకుండా పోయారు. ఈ మధ్యలో ఆయన కొన్ని రహస్య సమావేశాలు నిర్వహించారు. కానీ వివరాలు బయటకు రాలేదు. ఇటీవల హైదరాబాద్ వచ్చిన ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్‌ను కూడా కలిశారు. కంది ఐఐటీకి వచ్చిన ఆయనకు ప్రోటోకాల్ లేకపోయినా ఆయన వద్దకు వెళ్లి మరీ ఆహ్వానించడం చాలా మందిని ఆశ్చర్యపరిచింది. ఆయనకు ఎందుకు అవకాశం వచ్చిందో మెల్లగా కన్ని విషయాలు వెలుగులోకి వస్తున్నాయని రాజకీయవర్గాలు చెబుతున్నాయి. విజయసాయిరెడ్డి రాజకీయాలకు శాశ్వతంగా దూరం కాలేదు. ఆయన కొంత విరామం తీసుకోవాలనుకున్నారు. ముఖ్యంగా వైసీపీకి రాజీనామా చేసిన వెంటనే మరో పార్టీలో చేరితే అనేక ప్రశ్నలు వస్తాయని అందుకే కొంత కాలం విశ్రాంతి తీసుకోవాలని అనుకున్నారు. భారతీయ జనతా పార్టీలో చేరేందుకు అన్నీ మాట్లాడుకున్న తర్వాతనే రాజీనామా చేశారని ప్రస్తుతం ఓ క్లారిటీ వచ్చిందని అంటున్నారు. ఆయన బయటకు కనిపించకపోయినా..తెలియకపోయినా బీజేపీ పెద్దలతో నిరంతరం టచ్ లో ఉంటున్నట్లుగా తెలుస్తోంది. తాను రాజీనామా చేసిన రాజ్యసభ సీటును మళ్లీ ఆయన కోరుకోవడం లేదు. పదవి లేకపోయినా పర్వాలేదు ఆయన బీజేపీలో చేరాలనుకుంటున్నారు. అందుకే తను రాజీనామా చేసిన స్థానంలో ఉపఎన్నిక జరిగిన వెంటనే ఆయన బీజేపీలో చేరేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటారని చెబుతున్నారు.ఇప్పటి వరకూ ఉన్న విశ్వసనీయ సమాచారం మేరకు జూన్ లేదా జూలై నెలల్లో బీజేపీ తీర్థాన్ని పుచ్చుకునేందుకు విజయసాయిరెడ్డి రెడీ అయ్యారని అంటున్నారు. బీజేపీ పెద్దలు కూడా ఈ అంశంపై సానుకూలంగా ఉన్నారని.. అలా డీల్ మాట్లాడుకున్నందునే రాజీనామా చేశారని అంటున్నారు. అయితే విజయసాయిరెడ్డిని పార్టీలో చేర్చుకోవడంపై కూటమి పార్టీలు ఎలా స్పందిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. ఆయన తన పదవికి రాజీనామా చేసినప్పుడు టీడీపీ అధినేత చందర్బాబు, జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ గురించి చాలా పద్దతిగా మాట్లాడారు. వారిపై తాను చేసిన వ్యాఖ్యలు కేవలం రాజకీయాల్లో భాగంగా చేసినవే తప్ప.. వ్యక్తిగతంగా తనకు వారితో మంచి సంబంధాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. విజయసాయిరెడ్డిపై అనేక కేసులు ఉన్నాయి. జగన్ అక్రమాస్తుల కేసుల్లో ఆయన ఏ2గా ఉన్నారు. అలాగే కాకినాడ పోర్టును బెదిరించి రాయించుకున్నారన్న కేసుల్లోనూ ఇటీవల ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. ఇంకా అనేక స్కాముల్లో ఆయన పేరు ఉ ందని ప్రచారం జరుగుతున్న సమయంలోఆయన వైసీపీకి గుడ్ బై చెప్పారు. ఇప్పుడు బీజేపీలోనే చేరాలనుకుంటున్నారు. ఆయనను చేర్చుకుంటారా లేదా అన్నదానిపై ఇంకా క్లారిటీ రావాల్సి ఉంది.

# అమరావతి అప్పులకు లైన్ క్లియర్

విజయవాడ : రాజధాని నిర్మాణానికి సేకరించిన భూముల్ని విక్రయించడం ద్వారా నిధులు సమీకరిస్తామని, ప్రజలపై ఎలాంటి భారాలు మోపమని ఏపీ మంత్రి నారాయణ స్పష్టం చేశారు. అమరావతి నిర్మాణంపై వైసీపీ అధ్యక్షుడు జగన్ వ్యాఖ్యల్ని నారాయణ ఖండించారు. మరోవైపు అమరావతి రుణాలకు లైన్ క్లియర్ అయ్యింది.అమరావతిలో ల్యాండ్ పూలింగ్ ద్వారా తీసుకున్న భూములలో కొంత మేర అమ్మడం ద్వారా రాజధానిని నిర్మిస్తామని మంత్రి నారాయణ వివరించారు. మరోవైపు అమరావతి రుణాల మంజూరులో ఎదురవుతోన్న సాంకేతిక సమస్యలను అధిగమించినట్టు సిఆర్‌డిఏ ప్రకటించింది. రాజధాని అప్పులపై ఆర్థిక సంస్థలు సంతృప్తి చెందినట్టు సీఆర్‌డిఏ కమిషనర్ కన్నబాబు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ రాజధాని నగరం అమరావతి నిర్మాణం కోసం ప్రజలపై ఒక్క రూపాయి కూడా భారం వేసేది లేదని చెప్పారు. అమరావతిపై మాజీ ముఖ్యమంత్రి జగన్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి నారాయణ నెల్లూరులో మీడియాతో మాట్లాడారుఅమరావతి రాజధాని నిర్మాణానికి హడ్కో ప్రపంచ బ్యాంకు, ఒఎఐః తో పాటు జర్మనీ బ్యాంకు నుంచి రుణాలు సేకరిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాజధానిపై ప్రతిపక్షాల మాటలు వినవద్దని, నమ్మవద్దని ప్రజలకు సూచించారు. రాజధాని అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ఉండాలని సీఎం భావిస్తున్నారని, అందుకు అనుగుణంగా పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నమని చెప్పారు.రాష్ట్ర బడ్జెట్ లో అమరావతికి 6 వేల కోట్లు కేటాయించారని, అవసరమైతే ఇంకా నిధులు ఇస్తామని ముఖ్యమంత్రి చెప్పినట్లు మంత్రి వివరించారు. రాజధాని విషయంలో పారదర్శకంగా ఉంటామని, ఎలాంటి అవకతవకలు ఉండవని మరోసారి స్పష్టం చేశారు.ూాఖీ రేట్ల ప్రకారం మాత్రమే టెండర్లు పిలిచి నిర్మాణాలు చేస్తున్నామని, గత ప్రభుత్వం మాదిరిగా నిధులు పక్క దారి పట్టించడం లేదని చెప్పారు. 217 చ.కి.మీ పరిధిలో పరిధిలో అంతర్జాతీయ ప్రమాణాలతో 5 వేల ఎకరాల్లో రాజధాని నిర్మాణం జరుగుతుందన్నారు. 50 వేల కోట్ల పనులకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి నారాయణ చెప్పారు. అమరావతిలో 1000 నుంచి 1200 ఎకరాల్లో అంతర్జాతీయ యూనివర్సిటీలు, పాఠశాలలు, పలు సంస్థలకు భూములు కేటాయించినట్లు మంత్రి నారాయణ తెలిపారు.అమరావతి నిర్మాణానికి ప్రపంచ ఆర్థిక సంస్థలు ఇప్పటికే రుణాలను మంజూరు చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయి. పలు అంతర్జాతీయ సంస్థలతో పాటు హడ్కో కూడా భారీగా రుణాలను ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ క్రమంలో రాజధాని నిర్మాణం, రాజకీయ అభ్యంతరాలపై రుణాలను మంజూరు చేసే సంస్థలకు పలువురు ఫిర్యాదు చేశారు. అమరావతి నిర్మాణంపై రాజకీయంగా ఏకాభిప్రాయం లేదని ఫిర్యాదు చేయడంతో నిధుల విడుదలలో జాప్యం జరిగింది. డిసెంబర్ నాటికి రుణాలకు సంబంధించిన నిధులు విడుదల కావాల్సి ఉండగా అందులో జాప్యం జరిగింది.ణ మంజూరులో జరుగుతున్న జాప్యంపై సిఆర్‌డిఏ కమిషనర్ కన్నబాబు వివరణ ఇచ్చారు. రుణాల మంజూరుపై వ్యక్తమైన అభ్యంతరాలకు వివరణ ఇచ్చినట్టు స్పష్టం చేశారు. అయా సంస్థల ప్రతినిధులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సంతృప్తి వ్యక్తం చేశారని వివరించారు. రుణాల విడుదలకు సంబంధించిన ప్రక్రియ కొలిక్కి వచ్చిందని బ్యాంకు ఖాతాలు కూడా సిద్ధమైనట్టు తెలిపారు. రుణ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేవని కన్నబాబు వివరించారు.

# పోసాని... తర్వాత ఎవరు...

ఒంగోలు : కేసుల భయంతో వైసీపీ నేతలు వణికిపోతున్నారంట. మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో మొదలైన అరెస్టుల పర్వం కొనసాగుతూనే ఉ ంది. గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీపై వరుసగా నమోదవుతున్న కేసులతో ఆయనకు ఇప్పట్లో బెయిల్ లభించే అవకాశం లేదంటున్నారు. తాజాగా.. సినీ నటుడు, వైసీపీ నేత, బూతుల సామ్రాట్ పోసాని కృష్ణమురళిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రజలు, పార్టీ కేడర్‌ను ఇబ్బంది పెట్టిన ఏ ఒక్కరినీ వదలి పెట్టబోమని శాసనమండలిలో మంత్రి నారా లోకేష్ ప్రకటించగానే పోసాని రూపంలో మరో వికెట్ పడటంతో.. నెక్ట్స్ ఎవరో అని వైసీపీ నాయకులు బెంబేలెత్తుతున్నారంట.మంత్రి నారా లోకేష్ శాసనమండలిలో చేసిన వ్యాఖ్యలకు అనుగుణంగా యాక్షన్ పార్ట్ కొనసాగుతోంది. వైసీపీ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఎవరైతే చట్టాన్ని ఉల్లంఘించి ప్రజలను, టీడీపీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టారో.. వారిని వదిలే ప్రసక్తే లేదని.. టైం.. డేట్ కూడా రాసుకోండి అంటూ మంత్రి నారా లోకేశ్ మండలిలో ప్రతిపక్ష సభ్యులను ఉద్దేశించి తాజాగా వ్యాఖ్యానించారు. తద్వారా త్వరలో మరికొంత మంది వైసీపీ నేతలు అరెస్టు కాబోతున్నారని లోకేష్ క్లియర్ కట్ గా చెప్పారు. దీంతో అధికారంలో ఉన్నంత కాలం ఇష్టానుసారం చెలరేగి పోయిన వైసీపీ నేతలు వణికిపోతున్నారు. ఎవరు ఎప్పుడు కటకటాల పాలుకావాల్సి వస్తుందోనని భయపడుతున్న పరిస్థితి.మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో మొదలైన అరెస్టుల పర్వం కొనసాగుతూనే ఉ ంది. ఇప్పటికే గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీపై వరుసగా కేసుల మీద కేసులు నమోదౌతున్నాయి. సిట్ విచారణ కొనసాగుతుంది. వంశీ బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తూ సిట్ అధికారుల ముందు తమ గోడు వెళ్లబోసుకుని కేసులు పెడుతున్నారు. అంతకు ముందు నమోదైన కేసుల సంగతి పక్కన పెడితే? అరెస్ట్ అయ్యాక కూడా వంశీపై వరసగా నమోదవుతున్న కేసులతో.. ఆయన ఇప్పట్లో జైలు నుంచి బయటకు వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు.తాజాగా.. సినీ నటుడు, వైసీపీ నేత పోసాని కృష్ణమురళిని పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ లోని రాయదుర్గం మైహోం భూజా అపార్ట్ మెంట్స్ లో ఉంటున్న పోసానిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వైసీపీ హయాంలో ఇష్టానుసారం నోరు పారేసుకున్న పోసాని కృష్ణమురళీ .. రెండు నెలల క్రితం మీడియా సమావేశం పెట్టి తనకు జ్ఞానోదయం అయ్యిందనీ, ఇకపై రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటించారు. అయితే అరెస్ట సమయంలో పోసాని పెద్ద మెలో డ్రామానే నడిపారంట. పోలీసులతో వాగ్వివాదానికి దిగి, బనీన్, నిక్కర్ మీదనే హడావుడి చేశాడు. డ్రెస్ వేసుకుని రావాలని చెప్పినా వినకుండా ఆయన ఓవరాక్షన్ చేస్తుండటంతో.. అతి కష్టంమీద పోలీసులు పోసానిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.పోసాని కృష్ణమురళి.. ఆ వ్యక్తి పేరు, భాష గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆయన నోరు తెరిస్తే బూతు పురాణం వల్లె వేశారు. పేరుకు ఆయనో సినిమా రచయిత, దర్శకుడు, నటుడు? ఆయన సినిమాల్లో నీతులు చెబుతుంటారు. కానీ మైకు దొరికితే చాలు పచ్చిబూతులతో చెలరేగిపోతారు. ముఖ్యంగా వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో జగన్ ప్రాపకం కోసం ఆయన ప్రెస్‌మీట్లు పెట్టి వాడిన బూతు డైలాగులు ఇప్పటికీ అందరి చెవుల్లో రీసౌండ్ ఇస్తూనే ఉంటాయి. అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు, లోకేశ్, జనసేన అధినేత పవన్ కల్యాణ్, వారి కుటుంబసభ్యులపై పచ్చి బూతులతో చెలరేగిపోయేవారు.వారిని ఎంతగా తిడితే జగన్ దగ్గర అన్ని మార్కులు పడతాయన్న ఉద్దేశంతో నోటికి అడ్డూ అదుపూ లేకుండా విరుచుకుపడ్డారు. పోసాని తిట్ల దండకంలో రాయడానికి వీల్లేని, అత్యంత అభ్యంతకరమైన బూతులు వినిపించేవి. మీడియా ముందు మాట్లాడుతున్నాన్న సోయ లేకుండా తనదైన హావభావాలతో తెగ చెలరేగిపోయారాయన. పోసాని ప్రెస్‌మీట్ టీవీల్లో వస్తోందంటే చిన్న పిల్లలు, ఆడపిల్లలున్న ఇళ్లలో వెంటనే ఛానల్ మార్చేయడమో, టీవీ కట్టేయడమో చేసేవారంటే ఆయన ఎంత నీచంగా మాట్లాడేవారో అర్థమవుతుంది.ఆ ఎఫెక్ట్ తోనే పోసానిపై గతంలో కేసులు నమోదయ్యాయి. అయితే అధికారం వైసీపీదే కావడంతో చర్యలు లేకుండా పోయాయి. వైసీపీ ప్రభుత్వంలో ఏపీఎఫ్‌టీవీడీసీ చైర్మన్‌గా పోసాని కృష్ణ మురళి పనిచేశారు. ఆ సమయంలో చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌తోపాటు నారా లోకేశ్ ను అసభ్యకరంగా దూషించారు. దాంతో ఏపీలోని పలు స్టేషన్‌లలో ఆయనపై కేసులు నమోదయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ఆయన పలు సందర్భాల్లో అభ్యంతరకర భాషతో కూటమి నేతలను దూషించారు. ఇటీవల కాలంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిపైనా అనుచిత వ్యాఖ్యలు చేశారు. దాంతో ఆయనపై బాపట్ల, అనంతపురం, పల్నాడు జిల్లా నరసరావుపేట, చిత్తూరు జిల్లా యాదమరి, తిరుపతి జిల్లా పుత్తూరులో పోలీసులకు ఫిర్యాదులు అందాయి.మొత్తంగా ఏపీ వ్యాప్తంగా పలు అంశాలపై పోసానిపై 11 కేసులు నమోదయ్యాయి. ఇదిలా ఉంటే.. రెండు నెలల క్రితం పోసాని మీడియా సమావేశం పెట్టి తనకు జ్ఞానోదయం అయ్యిందనీ, ఇకపై రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటించారు. దీంతో కూటమి ప్రభుత్వం తనను వదిలేస్తుందని పోసాని భావించినట్లున్నారు. కానీ, బండబూతులు తిట్టి రాజకీయాలు వదిలేశానంటే కుదరదని పోలీసులు అరెస్ట్ చేసి ఆయనకు క్లారిటీ ఇచ్చారు.మండలిలో లోకేశ్ స్ట్రాంగ్ వార్నింగ్ తరువాత చాలా మంది వైసీపీ నేతలు రహస్య ప్రాంతాలకు వెళ్లి తలదాచుకుంటున్నారని ఏపీ రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వంశీ అరెస్టు తరువాత ఎవర్ని అరెస్టు చేస్తారోనని వైసీపీ నేతలు భయంతో వణికిపోతున్నారు. అయితే ముందుగా పోసాని వంతు వచ్చింది. పోసానిని అరెస్టు చేసిన తరువాత నెక్ట్స్ ఎవరు..? అనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. .అయితే, ఈసారి పక్కాగా కొడాలి నాని అరెస్టు ఉంటుందని వైసీపీ నేతలు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే కొడాలి నానిపై పోలీసులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. గతంలో ఆయనపై కేసులు, ప్రస్తుతం పలు స్టేషన్‌లలో ఆయనపై నమోదైన కేసుల వివరాలను సేకరిస్తున్నారట.అరెస్ట్ భయంతోనే కొడాలి నాని హైదరాబాద్‌తోపాటు బెంగళూరు వంటి నగరాల్లోనే ఎక్కువగా ఉంటున్నారని టాక్ నడుస్తోంది. ఇటీవల వైసీపీ అధ్యక్షుడు జగన్.. వంశీని పరామర్శించేందుకు విజయవాడ జైలుకు వెళ్లారు. ఆ సమయంలో జగన్ వెంట కొడాలి నాని ఉ న్నాడు. మరుసటి రోజు గుంటూరు మిర్చి యార్డుకు జగన్ వెళ్లిన సమయంలోనూ కొడాలి నాని ఉన్నాడు. ఆ వెంటనే కొడాలి నాని తన అనుచరులకు కూడా చెప్పకుండా రహస్య ప్రాంతానికి వెళ్లిపోయారంటున్నారుమొత్తమ్మీద పోసాని కృష్ణమురళి అరెస్టుతో జగన్ మళ్లీ బెంగళూరు నుంచి ఏపీకి రావాల్సిన పరిస్థితి తలెత్తిందన్న సెటైర్లు వినిపిస్తున్నాయి. మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అరెస్ట్ చేసినప్పుడు జగన్ బెంగళూరు ప్యాలెస్‌లోనే ఉన్నారు. అప్పట్లో జగన్ బెంగళూరు నుంచి నేరుగా నెల్లూరు జైలుకు వెళ్లి పిన్నెల్లిని పరామర్శించరు. ఇటీవలే విజయవాడ జైలుకెళ్లి వల్లభనేని వంశీతో జగన్ ములాఖత్ అయ్యాడు. ప్రస్తుతం పోసాని మురళీ కృష్ణ వంతు వచ్చింది . రాజకీయాలు వదిలేసానంటున్న పోసానిపై అమితమైన ప్రేమ కురిపిస్తున్న జగన్ మళ్లీ బెంగళూరు నుంచి మళ్లీ పరామర్శకు వస్తారంటున్నారు. అదే జరిగితే ముస్ముందు జగన్ మరిన్ని జైలు యాత్రలు చేయాల్సిన పరిస్థితి వస్తుందని వైసీపీ వర్గాల్లో టాక్ నడుస్తోంది.

# పదవుల కోసం పాకులట..?

విజయవాడ : వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఇప్పటికైనా పదవుల కోసం పాకులాడుకుండా ప్రజాసమస్యలను పట్టించుకోవడం మేలు. కేవలం ప్రతిపక్ష హోదా కోసం పట్టుపట్టకుండా జనం బాట పడితే మేలంటున్నారు. గత ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారు. ఇప్పుడు అసెంబ్లీకి పోనంటున్నారు. తనకు ప్రతిపక్ష హోదా ఇస్తే తప్ప రానుంటున్నారు. ఎవరి మీద అలక? జనం మీదనా? లేక ప్రతిపక్ష హోదా ఇవ్వని అధికార పార్టీ మీదనా? అన్నది ప్రజలు ఆలోచించుకునే అవకాశముంది. ఎన్నికలు ముగిసి ఏడాదవుతుంది. బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి. తనకు ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే తాను అసెంబ్లీకి రానంటూ జగన్ మొండి కేసి కూర్చుకున్నారు. అనర్హత వేటు పడుతుందని ఒక రోజు వెళ్లి రావడం మిగిలిన రోజుల్లో సభకు డుమ్మా కొట్టడం జగన్ కు అలవాటుగా మారింది. అయితే ముఖ్యమంత్రిగా ఉంటే తప్ప సభకు వెళ్లరా? లేకపోతే ప్రతిపక్ష హోదా ఇస్తే తప్ప సమావేశాల్లో పాల్గొనరా? ప్రజా సమస్యల కంటే పదవులపైనే జగన్ ఎక్కువ మక్కువ చూపుతున్నారన్న అభిప్రాయం ప్రజల్లో కలిగేందుకు ఎక్కువ అవకాశముంది. ప్రతిపక్ష హోదా ఉంటే అసెంబ్లీలో ఎక్కువ సమయం మాట్లాడే అవకాశం ఇస్తారన్నది జగన్ వాదన. అలా మాట్లాడకుండా అధికార పార్టీ జగన్ ను అడ్డుకుంటే అది ఆయనకే సానుభూతి కలుగుతుంది. మాట్లాడేందుకు తగిన సమయం ఇవ్వకపోతే అప్పుడే వాకౌట్ చేసి బయటకు వచ్చి మీడియా సమావేశం పెట్టొచ్చు... కానీ జగన్ అలా చేయడం లేదు. ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే తాను రానుంటూ చిన్నపిల్లాడు మంకు పట్టునట్లు వ్యవహరిస్తుండటం కూడా చూసే వారికి ఇబ్బందికరంగా ఉంది. సభలో ఏదైనా అవమానం జరిగితే సభ నుంచి శపథం చేసి బయటకు రావచ్చు. కానీ పదవి ఇవ్వడం లేదంటూ తాను పోనంటూ మొరాయించడం జగన్ ఆలోచన ఎటు వెళుతుందన్నదానికి మాత్రం వైసీపీ నేతలకే అర్థం కావడం లేదు. తాను వెళ్లకుండా, తన పార్టీ గుర్తు మీద గెలిచిన మిగిలిన పది మంది ఎమ్మెల్యేలకు కూడా జగన్ ఇదే సూత్రాన్ని అమలు చేస్తున్నారు. తాను చెడింది కాకుండా.. తన తోటి ఎమ్మెల్యేలను కూడా సభకు వెళ్లకుండా నిలువరించడం ఎందుకన్న ప్రశ్న వినపడుతుంది.

వాళ్లు ఇవ్వమంటున్నా.. ఇవ్వాల్సిందేనని పట్టుబట్టడం ఎందుకని కొందరు ప్రశ్నిస్తున్నారు.. ఇక వైఎస్ జగన్ జనంలోకి వెళ్లాల్సిన సమయంలో ఇటు బెంగళూరు టు అమరావతి చక్కర్లు కొడుతూ కాలయాపన చేస్తున్నారన్న విమర్శలు సొంత పార్టీ నుంచే వినపడుతున్నాయి. ఇక్కడ కూర్చుని అధికార పార్టీపై విమర్శలు చేసే కన్నా జనంలోకి వెళ్లి తేల్చుకుంటే అది ప్లస్ గా మారుతుందని సూచిస్తున్నారు. కానీ జగన్ మాత్రం సంక్రాంతి నుంచి జిల్లాల పర్యటనలు వాయిదా వేసుకుంటూ వస్తున్నారు. ఇప్పుడు ఉగాది అంటున్నారు. ఉగాది నాటికి కూడా జనంలోకి రావడం డౌట్ గానే ఉంది. ఎందుకంటే ఎన్నికలకు ఇంకా సమయం ఉండటంతో ఇంత ముందు జనంలోకి వెళ్లడం వృథా ప్రయాస అని జగన్ భావిస్తున్నట్లుంది. కానీ ఈలోపు క్యాడర్ తో పాటు నేతలు కూడా చేజారిపోయే అవకాశముందన్న హెచ్చరికలు జగన్ చెవికి సోకడం లేదు.

# మాగంటి రిటైర్మెంట్...?

ఏలూరు : ఏలూరు మాజీ పార్లమెంటు సభ్యుడు మాగంటి బాబు రాజకీయంగా ఇబ్బందులు పడుతున్నట్లే కనిపిస్తుంది. ఆయన ఇక ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకునట్లేనని చెప్పకతప్పదు. చంద్రబాబు పార్లమెంటు సీటును గత ఎన్నికల్లో మాగంటి బాబుకు ఇవ్వకుండా పక్కన పెట్టారు. బీసీలకు ఇవ్వాల్సి రావడంతో పాటు గుంటూరు, నరసరావుపేట, విజయవాడ వరసగా ఒకే సామాజికవర్గం నేతలకు టిక్కెట్లు ఇవ్వడంతో ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం టిక్కెట్ విషయంలో చంద్రబాబు మొన్నటి ఎన్నికల్లో ప్రత్యేకతను పాటించారు. యనమల రామకృష్ణుడి అల్లుడికి ఆ సీటును కేటాయించడంతో మాగంటి బాబుకు టిక్కెట్ దూరం అయిందనే చెప్పాలి. ఏలూరు పార్లమెంటు నియోజకవర్గానికి వచ్చే సరికి మాగంటి వెంకటేశ్వరరావు అలియాస్ బాబు ఈసారి చంద్రబాబు పక్కన పెట్టటానికి అనేక కారణాలున్నాయి. కొత్త వారికి అవకాశం ఇవ్వాలన్నది ఆయన అభిప్రాయం. అయితే మాగంటి కుటుంబానికి ఇక ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఒక ప్రత్యేకత ఉంది. ఆయన తండి దగ్గర నుంచి ఆయన వరకూ రాజకీయాల్లో కొనసాగారు. 1998 ఎన్నికల్లో ఏలూరు ఏంపీగా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన మాగంటి బాబు 2009లో టీడీపీ తరుపున పోటీ చేసి ఓటమిపాలయ్యారు. తిరిగి 2014లో అదే స్థానం నుంచి గెలిచారు. 2019లో ఓటమి పాలయ్యారు. అయితే మాగంటి కుటుంబంలో వరస విషాదాలు చోటు చేసుకోవడంతో కొంత పార్టీ కార్యక్రమాలకు దూరమైనా ఎన్నికలకు ముందు యాక్టివ్ అయ్యారు.. అయితే ఎక్కువ మంది శాసనసభ నియోజకవర్గ ఇన్‌ఛార్జులు మాగంటి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించడంతో పాటు సామాజిక వర్గాల సమీకరణ మాగంటికి టిక్కెట్ రాకుండా పోయింది. అయితే టిక్కెట్ రాకపోయినా తనకు ఏదో ఒక పదవి లభిస్తుందని మాగంటి బాబు భావించారు. రాజ్యసభ కానీ, ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని పలు మార్లు చంద్రబాబుకు మాగంటి మొర పెట్టుకున్నారు. కానీ ఏడాది గడుస్తున్నా మాగంటి బాబు గురించి టీడీపీ అధినాయకత్వం పెద్దగా పట్టించుకోవడం లేదన్న అభిప్రాయం ఆయన సన్నిహితుల్లో వ్యక్తమవుతుంది. మొన్నామధ్య మాగంటి బాబు జనసేన నేత పవన్ కల్యాణ్ ను కలవడం కూడా రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నా ఇప్పటి వరకూ సానుకూలత ఫలితం రాలేదు.అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ మాగంటి బాబుకు ఆయన సామాజికవర్గమేఆయనకు శాపంగా మారిందని చెప్పాలి.

# అంత ఫీల్ గుడ్డేనా..

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత ఏదో జరిగిపోతుందని అందరూ ఊహించారు. కానీ ఇచ్చిన హామీలు అమలుపరుస్తామని చెబుతున్నప్పటికీ పెద్దగా అమలు కాలేదు. పింఛన్ల మొత్తాన్ని నాలుగు వేల రూపాయలుకు పెంచడం మినహా పెద్దగా ఒరిగిందేమీ లేదన్న కామెంట్స్ క్షేత్ర స్థాయిలో వినపడుతున్నాయి. మరోవైపు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని ఆర్భాటంగా ప్రకటించుకుంటున్నా మహిళలు అంత సంతోషంగా లేరన్నది కూడా అంతే వాస్తవం. అంతకు మించి ఇప్పటి వరకూ ఏ పథకాన్ని అమలు చేయకపోవడం.. అదిగో.. ఇదిగో అంటూ తేదీలు మారుస్తూ కాలయాపన చేస్తుండటంతో ప్రజలపై కూటమి ప్రభుత్వం పట్ల ఆశలు సన్నగిల్లినట్లే కనపడుతుంది ఇక ప్రధానమైన వర్గం రైతులు కూడా ఆందోళనలో ఉన్నారు. ఏ పంటకు సరైన గిట్టుబాటు ధర రాకపోవడంతో గతమే మేలన్న అభిప్రాయానికి అన్నదాతలు వచ్చే అవకాశముంది. మిర్చి రైతులను ఆదుకుంటున్నామని ప్రభుత్వం హడావిడి చేసిన ప్రకటనలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. ఏ పంటకు సరైన ధర లభించడం లేదని రైతాంగం ఆందోళన చెందుతుంది. మరొక వైపు అన్నదాత సుఖీ భవ పథకాన్ని ఇస్తామని ప్రకటిస్తున్నా తమ ఖాతాల్లో పడేంత వరకూ ఎవరికీ నమ్మకం లేదు. అందులో ప్రతి పథకంలో లబ్దిదారుల ఎంపిక ఎలా ఉంటుంది? తమ పేరు అందులో ఉంటుందా? లేదా? అన్న సందేహాలు కూడా కర్షకులకు కంటి మీద కునుకులేకుండా పోయింది. ఇక మహిళలకు ఉచిత బస్సు పథకం ఊసే లేకపోవడంతో పాటు పద్దెనిమిదేళ్లు నిండిన వారికి ప్రత్యేకంగా నిధులు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం దాని పేరు కూడా తలవడం లేదు. గత వైసీపీ హయాంలో ఏదో ఒక రూపంలో డబ్బులు వచ్చేవి చేతుల్లో ఉండేవి. కానీ ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా తమకు అందలేదన్న నిరాశా, నిస్పృహలు అయితే బాగా కనపడుతున్నాయి. ఏ పథకాన్ని అమలు చేయాలన్నా నిధులు లేవని ప్రభుత్వం పదే పదే చెబుతుండటంతో తమకు ఇప్పట్లో అవి దరి చేరే అవకాశం లేదన్న నిర్ణయానికి వచ్చారు. అయితే అధికార పార్టీని ఏమీ అనలేక, తమలో తాము మహిళలు ఆర్థికంగా చితికిపోక తప్పదన్న నిర్ణయానికి వచ్చినట్లుంది.. ఇక గత వైసీపీ ప్రభుత్వంలోనూ జగన్ ఇలాగే భావించారు. ఫీల్ గుడ్ ఫ్యాక్టర్ ఎక్కువగా ఉందని, తనను పథకాలే తిరిగి గెలిపిస్తాయని జగన్ గట్టిగా నమ్మారు. కానీ ఎన్నికల ఫలితాలను చూసిన తర్వాత మైండ్ బ్లాంక్ అయింది.

# కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఏర్పాటుకు కృషి

**టీఆర్‌పీఎస్ మండల నూతన అధ్యక్షుడు సామల మధుసూదన్**

**వేద న్యూస్, శాయంపేట :**



శాయంపేట మండల కేంద్రంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తానని టీఆర్ పీఎస్ మండల నూతన అధ్యక్షుడు సామల మధుసూదన్ సోమవారం ఓ ప్రకటలో తెలిపారు. శాయంపేట మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘ భవనం లో నిర్వహించిన సమావేశంలో తనను టీఆర్ పీఎస్ మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్న మండల పరిధిలోని పలు గ్రామ కమిటీల అధ్యక్షులతో పాటు కులబాంధవులందరికీ కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం (టీఆర్ పీఎస్) బలోపేతానికి కృషి చేస్తానని, స్వర్గీయ రామా శ్రీనివాస్ ఆశయాలకు అనుగుణంగా ముందుకెళ్తానని తెలిపారు. మండలకేంద్రంలోపాటు అన్ని వివిధ గ్రామాల పద్మశాలి ప్రముఖులను, కుల పెద్దలను కలుపుకుని, వారి సలహాలు, సూచనలతో కులబాంధవులు అభివృద్ధి సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాగా, నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సామల మధుసూదన్‌ను టీఆర్‌పీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, ఎన్నికల అధికారి డాక్టర్ చందా మల్లయ్య, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు బిల్లా యాదగిరి, బాసాని చంద్రప్రకాశ్, తదితరులు అభినందించారు. మండల కమిటీ ఎన్నిక కోసం నాకు వెన్నుదన్నుగా నిలిచిన వావిలాల వేణు, పల్నాటి జలంధర్, గుర్రం అశోక్, దుంపేట్ రమేష్, కందకట్ల ప్రకాష్, దుంపేటి రమేష్, సామల భిక్షపతి, బూర పైడి, బూర ఈశ్వరయ్య, అల్లె రాజీరు, బాసని లక్ష్మీ నారాయణ తదితరులకు ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు.



# పూర్వ విద్యార్థి అపూర్వ సేవ

**వేద న్యూస్, కరీంనగర్:**

జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా మూలాలను మరవొద్దనే సదలోచనతో ఓ పూర్వ విద్యార్థి.. తన ఉన్నతికి పునాది వేసిన సంస్థకు తన వంతుగా సాయమందించి.. తన మంచి మనసును చాటుకున్నాడు. వివరాల్లోకెళితే.. కరీంనగర్ జిల్లా జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలకు విద్యార్థుల తాగునీటి సౌకర్యార్థం కళాశాల పూర్వ విద్యార్థి ముక్కశివకుమార్ రూ.50 వేల విలువగల తాగునీటి ప్యూరిఫైయర్, కూలర్ వితరణ చేశారు. ముక్క శివకుమార్ తనయుడు డాక్టర్ ముక్క శరత్ గారి చేతుల మీదుగా ప్యూరిఫైయర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి రమేష్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ రామస్వామి, కళాశాల అధ్యాపకులు ముక్క శరత్ ని అభినందించారు. శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ముక్క శివకుమార్‌ను కళాశాల పూర్వ విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని కళాశాల అభివృద్ధికి సహాయం చేయాలని కోరారు. విద్యార్థులు, కళాశాల సిబ్బంది ముక్కా శివకుమార్‌కి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా డా.శరత్ మాట్లాడుతూ తాగునీటి వసతిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ కార్తికేయ హాస్పిటల్‌లో జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. ఐక్యూఎస్సీ సమన్వయకర్త డాక్టర్ ఎస్ ఓదేలు కుమార్, అకాడమిక్ కోఆర్డినేటర్, కళాశాల పూర్వ విద్యార్థుల కన్వీనర్ డాక్టర్ కే రాజేంద్రం, సిపిడిసి సభ్యులు అన్వర్, ఈసీ మెంబర్ రంగారెడ్డి,ఇతర అధ్యాపకులు గణేష్, రాజ్ కుమార్, రవి ప్రకాష్, డాక్టర్ రవి,కిరణ్ కుమార్, ఉమా కిరణ్, మాధవి, సాయి, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

# సుభాష్ శర్మకు మరణ శిక్ష..!

**మొదటి పేజీ తరువాయి**

ప్రణయ్‌తోనే ఉంటానని పోలీసుల సమక్షంలో అమృత తేల్చిచెప్పింది. 2018 సెప్టెంబరు 14న వైద్య పరీక్షల కోసం భర్త ప్రణయ్, అత్త ప్రేమలతతో కలిసి అమృత ఆస్పత్రికి వెళ్లింది. హాస్పిటల్ నుంచి తిరిగి వెళ్తుండగా తన కుమార్తెను కులాంతర వివాహం చేసుకున్నాడనే నెపంతో మిర్యాలగూడ పట్టణానికి చెందిన మారుతీరావు అనే వ్యక్తి 2018 సెప్టెంబర్ 14న సుపారీ గ్యాంగ్‌తో యువకుడు ప్రణయ్‌ను హత్య చేయించాడు. కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలీసులు విచారణ పూర్తి చేసి, 8 మందిని నిందితులుగా పేర్కొంటూ న్యాయస్థానంలో 2019లో ఛార్జిషీట్ దాఖలు చేశారు. 6 ఏళ్లకు పైగా కోర్టులో విచారణ సాగగా, ఇటీవలే వాదనలు ముగిశాయి. తాజాగా ఎస్సీ, ఎస్టీ కోర్టు సంచలన తీర్పునిచ్చింది. ప్రణయ్ హత్య కేసులో ఏ1గా ఉన్న నిందితుడు మారుతీరావు 2020లో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ కేసులో ఏ2 సుభాష్ కుమార్ శర్మ, ఏ3 అస్గర్‌అలీ, ఏ4 బారీ, ఏ5 కరీం, ఏ6 శ్రవణ్‌కుమార్, ఏ7 శివ, ఏ8 నిజాంలు మిగిలిన నిందితులుగా ఉన్నారు. వీరిలో సుభాష్ శర్మకు బెయిల్ రాకపోవడంతో జైల్లోనే ఉండగా, అస్గర్ అలీ వేరే కేసులో జైలులో ఉన్నాడు. మిగిలిన వారందరూ బెయిల్ మీద బయటకు వచ్చారు. అనారోగ్య సమస్యలు ఉన్నాయని, తమపై ఆధారపడిన తల్లిదండ్రులు, పిల్లల కోసం శిక్ష తగ్గించాలని నిందితులు న్యాయస్థానాన్ని వేడుకున్నారు. తనకు ఈ కేసుతో సంబంధం లేదని అమృత బాబాయ్ శ్రవణ్ కుమార్ అన్నారు. ముగ్గురు పెళ్లికాని పిల్లలు ఉన్నందున దయ చూపాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ప్రణయ్ హత్య కేసులో నల్గొండ కోర్టు సంచలన తీర్పు నేపథ్యంలో ప్రణయ్ తండ్రి పెరుమాల బాలస్వామి స్పందించారు. తన కుమారుని పరువు హత్యపై నల్గొండలో ఈరోజు న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతో నేరస్తులకు కనువిప్పు కలగాలని అన్నారు. న్యాయం కోసం జస్టిస్ ఫర్ ప్రణయ్ అంటూ పోరాటం చేశామన్నారు. ఈ హత్య తర్వాత చాలా పరువు హత్యలు జరిగాయని వారందరికీ ఈ తీర్పు గుణపాఠం కలగాలని బాలస్వామి అన్నారు.

అంతేకాకుండా మేము ప్రణయ్ హత్య ద్వారా చాలా కోల్పోయాం. అమృతకు భర్త లేడు. నాకు కొడుకు లేడు. నా మనువడికి నాన్న లేడు అని ప్రణయ్ తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. సుభాష్ శర్మకు ఉరిశిక్ష మిగతా ఆరుగురికి యావజ్జీవ కారాగార శిక్ష పడిందని ఈ క్రమంలో వారి కుటుంబాలు కూడా బాధపడుతుంటాయని, తనకు ఎవరిపై కోపం లేదన్నారు. వారు కూడా ఈ రకమైన హత్యలకు పాల్పడడం విచారకరమని ప్రణయ్ తండ్రి అన్నారు. ఈ తీర్పుతో పరువు హత్యలు ఆగిపోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# అభివృద్ధికి ఆమడ దూరంలో రామలక్ష్మణపల్లి!

- దారంతా గతుకులు.. తాగునీటికి తిప్పలు
- కరెంటు ఇక్కట్లు.. ఆర్టీసీ బస్సు సౌకర్యం అంతంత మాత్రమే
- సమస్యల వలయంలో కామారెడ్డి జిల్లాకు సమీపంలోని పల్లె
- అధికారులు పట్టించుకోవాలని గ్రామస్తుల వేడుకోలు

**వేద న్యూస్, ఫోకస్ టీమ్ :**

"పల్లెలు దేశానికి పట్టుగొమ్మలు.." అని, పల్లెలు డెవలప్ అయితేనే దేశం అభివృద్ధి పథంలో ముందుకెళ్తాయని అంటారు. కానీ, ఆచరణలో మాత్రం ఆ విలేజ్ అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉంటోంది. తమ సమస్యలను పరిష్కరించే నాథుడే లేడా? అని గ్రామస్తులు వాపోతున్నారు. జిల్లాకు సమీపంలో ఉన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు తమ సమస్యల పరిష్కారానికి ముందుకు రావడం లేదని, కనీసంగా అటువైపు చూడటం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

కామారెడ్డి జిల్లాకు సరిగ్గా 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న రామలక్ష్మణపల్లి గ్రామం సమస్యల వలయంలో చిక్కుకోంది. తమ గ్రామంలో తాగునీటి, కరెంటు సమస్యలు నెలకొన్నాయని, ఆర్టీసీ బస్సు కూడా కరెక్ట్ టైంకు రావడం లేదని, ఊరికి వెళ్లేందుకు ఉన్న దారంతా గతకులమయంగా మారిందని గ్రామస్తులు వెల్లడిస్తున్నారు.



కామారెడ్డి జిల్లా గాంధారి మండల పరిధిలో గల ఈ రామలక్ష్మణపల్లె.. అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవాల్సిందేనని చెబుతున్నారు. ప్రభుత్వాలు, ఎమ్మెల్యేలు మారినా.. తమ గ్రామంలో కనీస మౌలిక వసతుల కల్పనకు అడుగులు పడటం లేదని వివరిస్తున్నారు. కనీసంగా రోడ్లు, డ్రైనేజీలు లేవని, తాము కనీస అవసరాలకు రెండు కిలోమీటర్ల దూరం నడవాల్సిన దుస్థితి నెలకొందని ఊరి ప్రజలు వాపోతున్నారు. తాగునీటికి తిప్పలు పడాల్సిన పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. కనీసంగా వాటర్ ట్యాంకు రాక.. అవస్థలు పడుతున్నట్లు వెల్లడిస్తున్నారు. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లామని ప్రజలు పేర్కొంటున్నారు. గ్రామంలో బోరు బావులు లేక మిషన్ భగీరథ ద్వారా మాత్రమే నీరు సరఫరా అవుతోందని, అయితే, పూర్తిస్థాయిలో నీరు అందడం లేదని కొందరు చెబుతున్నారు. రామలక్ష్మణపల్లి గ్రామం నుంచి గాంధారికి



వెళ్లేందుకు రోడ్డు లేక అవస్థలు పడుతున్నట్టు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యేకు రోడ్డు వేయాలని వినతి పత్రాలు సమర్పించామని గ్రామస్తులు చెబుతున్నారు. గత ఎమ్మెల్యే తన గ్రామం వరకే రోడ్డు వేసుకొని, తమ గ్రామాన్ని మర్చిపోయారని రామలక్ష్మణపల్లివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నల్లమడుగు గ్రామం నుంచి గాంధారి వరకు రోడ్డు వేయించాలని, రామలక్ష్మణపల్లి గ్రామాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామ అభివృద్ధికి ప్రస్తుత ఎమ్మెల్యే పాటుపడాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

# టీఆర్‌పీఎస్ మండల అధ్యక్షుని ఎన్నిక చెల్లదు..!

**వేద న్యూస్, శాయంపేట :**



హనుమకొండ జిల్లా శాయంపేట మండల కేంద్రంలో సోమవారం శాయంపేట గ్రామ పద్మశాలి అధ్యక్షుడు బాసని ప్రకాష్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం జరిగిన ఎన్నిక ఏకపక్షంగా ముగ్గురు సమక్షంలో ఎన్నికైనట్టు ప్రకటించుకున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంగా ఎన్నికలు జరగాలేదని అప్రజాస్వామ్యంగా మొండి పట్టుదలతో పద్మశాలి జిల్లా అధ్యక్షుడు చంద మల్లయ్య, జిల్లా యూత్ అధ్యక్షుడు బిల్లా యాదగిరి, సామల మధుసూదన్‌తో కుమ్మకు అయి ఈ ఎన్నిక నిర్వహించారని అన్నారు. అనంతరం వంగర సాంబయ్య మాట్లాడుతూ మండలంలో ఉన్నా పద్మశాలీలందరికీ 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు నుండీ 100 సంవత్సరాల వయసులో వున్న వారు నామమాత్రపు రుసుముతొ చేర్పించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించిన తర్వాత ఎన్నికల ప్రక్రియకుపోవాలని, మండలంలోని మేజర్ గ్రామం శాయంపేట జనాభాపరంగా పరిగణలోకి తీసుకోవాలని కోరినప్పటికీ వారి మనసు కరగలేదని పూర్తిగా డబ్బులకు జిల్లా నాయకత్వం అమ్ముడుపోయారని ఆరోపించారు. మండల అధ్యక్ష బరిలో ఉన్న తనకి మధుసూదన్ డబ్బులు ఎరా చూపారని ఆర్థిక ఆశలు చూపిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా నాయకులను కోరినప్పటికీ కనికరం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.శాయంపేట గ్రామ పద్మశాలీలు ఏకమై,ఆదివారం జరిగిన సమావేశాన్ని పూర్తిగా బహిష్కరించామని తెలిపారు. శాయంపేట గ్రామ పద్మశాలీలు వారి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూన తరుణంలో సమావేశపు హాల్ నుండి బయటకు పోయి చేనేత సంఘ ఆవరణలో కాకుండా నడి బజార్లో ప్రకటించుకున్నారని వారు మండిపడ్డారు. సంఘ ఆవరణలో ఎలాంటి ఎన్నికలు జరగలేదని వారు తెలిపారు. ఆ సంఘంతో శాయంపేట గ్రామ పద్మశాలి కమిటీ బంధువులకు ఎలాంటి సంబంధం లేదని భవిష్యత్తులో మేము ఐక్యంగా ఉంటూ కుల బంధువులకు ఎలాంటి కష్టం వచ్చినా అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు. సమావేశంలో పద్మశాలి అధ్యక్షుడు బాసని ప్రకాష్, ఉపాధ్యక్షుడు తుమ్మ ప్రభాకర్, మామిడి మారుతి, కార్యదర్శి మంత్రి రాజు, కోశాధికారి గొట్టిముకుల రమేష్, పద్మశాలి గ్రామ పెద్దమనిషి వల్పదాసు రాము, పద్మశాలి యువసేన అధ్యక్షులు శ్రీనివాస్, సలహాదారులు చిందం రవి, చేనేత సహకార సంఘ డైరెక్టర్లు బూర లక్ష్మీనారాయణ, దిడ్డి ప్రభాకర్, రంగు ఆనందం, కమిటీ సభ్యులు కందగట్ల సంతోష్, గొట్టిముక్కుల చంద్రప్రకాష్, బత్తిని శ్రీధర్, మార్త రాజు, గాజుల రాజు, పూలకవి రాజు, దాసరి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# 'స్టేషన్'పై కడియం మార్క్..!

**మొదటి పేజీ తరువాయి**

రూ.800 కోట్ల అభివృద్ధి పనులకు ఈ నెల 16న శంకుస్థాపన చేయించనున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడుతూ తనదైన డెవలప్‌మెంట్ మార్క్ ప్రజల్లో వేసేందుకు శ్రమిస్తున్నారు. దాంతో పాటు భారీ బహిరంగ సభను సక్సెస్ చేసేందుకు శ్రీహరి సమాయత్తమవుతున్నారు.

## సమర్థవంతమైన నాయకుడిగా కడియంకు పేరు

తనకు ఇచ్చిన బాధ్యతను సమర్థవంతంగా కడియం శ్రీహరి నిర్వర్తిస్తారనే పేరుంది. పార్టీ ఆదేశాల మేరకు తనకు అప్పగించిన పనిని చిత్తశుద్ధితో.. వినూత్నమైన ఆలోచనతో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తుంటారు. ఈ క్రమంలోనే ప్రస్తుత రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వానికి అనుభవజ్ఞుడైన కడియం శ్రీహరి సలహాలు, సూచనలు, పనితనం అవసరమవుతాయనే అభిప్రాయంతో.. ఆయనను మంత్రివర్గంలోకి తీసుకోవాలనే ప్రతిపాదనలను తెరమీదకు తీసుకొచ్చినట్టు తెలుస్తోంది. పూర్వాశ్రమంలో టీడీపీలో ఎన్టీఆర్, చంద్రబాబు వంటి నాయకుల వద్ద కడియం శ్రీహరి పనిచేసిన క్రమంలో ఆయన వర్క్, కమిట్‌మెంట్ పట్ల నమ్మకం, సానుకూల దృక్పథం రాజకీయ వర్గాలు, నాయకుల్లో ఆయా సందర్భాల్లో వ్యక్తమైంది. ఈ క్రమంలో కడియం శ్రీహరి సేవలను ఉపయోగించుకునేందుకు కాంగ్రెస్ సర్కారు మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. గతంలో విద్యాశాఖ మంత్రిగా సమర్థవంతంగా పనిచేసిన శ్రీహరికి ప్రస్తుత ప్రభుత్వంలోనూ ఆ మేరకు కీలక శాఖను అప్పగిస్తే మేలు జరుగుతుందనే సమాలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో పాటు స్టేషన్‌ఘన్‌పూర్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి నెగ్గినవారు మంత్రులు అవుతారనే సంప్రదాయం ఇప్పటికే ఉంది. ఈ స్థానం నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన టి.హయగ్రీవాచారి, గోకరామస్వామి, గుండె విజయరామారావు, తాటికొండ రాజయ్యతో పాటు కడియం శ్రీహరి వారి టర్మ్‌లలో మంత్రులయ్యారు. రాజయ్య, కడియం గతంలో డిప్యూటీ సీఎంలుగానూ పని చేశారు. కాగా, ఈ టర్మ్‌లో సైతం కడియం శ్రీహరికి మరోసారి మంత్రి పదవి దక్కితే.. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి మంత్రి పదవులు దక్కే అసెంబ్లీ సెగ్మెంట్‌గా ప్రత్యేకత నెలకొననుంది. చూడాలి మరి.. ఏం జరుగుతుందో..

# ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**మొదటి పేజీ తరువాయి**

అన్నారు. ఈ సందర్భంగా ఎల్‌ఆర్‌ఎస్ చేసుకోవడంపై డెవలపర్లు, ప్లాట్ల యజమానులు అడిగిన పలు సందేహాలను కలెక్టర్లు, కమిషనర్ నివృతి చేశారు. ఈ సమావేశంలో కుడా పిఓ అజిత్ రెడ్డి, సిటీ ప్లానర్ రవీందర్,జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి, సంబంధిత శాఖల అధికారులతో పాటు లేఅవుట్, నాన్ లేఅవుట్ యజమానులు డెవలపర్లు, టౌన్ ప్లానర్ లు, లే అవుట్ రైటర్ లు, బిల్డర్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.



# జూడో పోటీల్లో అంధ విద్యార్థుల సత్తా

- అభినందించిన బల్దియా కమిషనర్

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

అంతర్జాతీయ స్థాయి జూడో పోటీలకు అర్హత సాధించిన అంధ విద్యార్థులను బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా వరంగల్ లూయిస్ బ్రెయిలీ ఆదర్శ అంధుల పాఠశాలకు చెందిన యాజమాన్యం విద్యార్థులు సోమవారం ప్రధాన కార్యాలయం లో బల్దియా కమిషనర్ డా.అశ్విని తా నాజీ వాకడే ను కలిశారు. అనంతరం పాఠశాల బాధ్యులు మాట్లాడుతూ ఫిబ్రవరి 24-28 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లోని లక్నో లో జరిగిన 13 వ నేషనల్ పారా జూడో పోటీలకు అంధుల పాఠశాల కు చెందిన 9 మంది విద్యార్థులు జూడో పోటీలకు ఎంపికై అట్టి క్రీడల్లో పాల్గొని 5 గురు విజేతలుగా నిలిచి బంగారు వెండి కంచు పథకాలను సాధించడం జరిగిందని అన్నారు. జి.వినోద్ కుమార్ పి.నాగరాజు అనే విద్యార్థులు మే 8-16 వరకు కజకిస్థాన్ దేశంలోని ఆస్తానా లో జరిగనున్న ప్రపంచ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందిస్తూ సాధించాలనే తపన ఉంటే వైకల్యం అవరోధం కాదని అంధ విద్యార్థుల సంకల్పం గొప్పగా ఉందని అంతర్జాతీయ స్థాయి లో రాణించి నగరానికి వన్నె తీసుకువచ్చారని మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరాలని కమిషనర్ ఆకాంక్షించారు. అనంతరం క్రీడల్లో సాధించిన ట్రోఫీ మెడల్స్ ను కమిషనర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సిఎంహెచ్ఓ రాజారెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ నలివేల కల్యాణి, మేనేజ్మెంట్ సభ్యులు మణిశంకర్ ,అంధ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073